క్లుప్తంగా

సూర్యనారాయణుడికి విశేష పూజలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచి చంద్రశేఖరేంద్ర స్వామి పుణ్యక్షేత్రం శివాలయంలో సూర్యనారాయణస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం సూర్య ఆరాధన చేశారు. మహిళలు ఆవుపాలతో పొంగిలి చేసి నివేదన సమర్పించారు. త్రిచ సౌర, అరుణ పారాయణ నిర్వహించారు. ఆరోగ్య ప్రధాత సూర్యనారాయణ స్వామికి పూజలు చేయడం వలన సర్వ ప్రాణులు ఆరోగ్యంగా ఉంటాయని దేవస్థానం అర్చకులు ఈ సందర్భంగా తెలిపారు.

నేడు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట

పెనమలూరు: గోసాల గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. గోసాల శ్రీ సిటీలో శ్రీ షిరిడీ సాయిబాబా, గణపతి, దత్తాత్రేయ విగ్రహాలతో పాటు ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం ఉదయం 10.38 గంటలకు ఘనంగా జరుపనున్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక పూజల్లో దంపతులు



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పదుల సంఖ్యలో దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠకు వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు కొనసాగాయి. ధ్వజస్తంభాన్ని అలంకరించి ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

37వ రోజు మండల దీక్ష పారాయణం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న మండల దీక్ష పారాయణం ఆదివారం 37వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులు ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం జరిపారు. అనంతరం కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 8.10 గంటలకు జరిగే శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని భక్తులు జయప్రదం చేయాలని శ్రీధర కోరారు.

రేపటి నుంచి ఉపాధి గ్రామ సభలు

ఉంగుటూరు: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలు ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏపీవో వినీల తెలిపారు. 20న నందమూరు, నారయ్య అప్పారావుపేట, తేలప్రోలు, మానికొండ, పొట్టిపాడు, 22న వేమండ, ఆత్కూరు, ముక్కపాడు, పెద అవుటపల్లి, 25న ఆముదాలపల్లి, లంకపల్లి, కొయ్యగూరపాడు, చాగంటిపాడు, 28న నాగవరప్పాడు, వెన్నూతల, ఎలుకపాడు, ఉంగుటూరు, ఇందుపల్లి, చికినాల, బొకినాల, తుట్టగుంట, మధిరపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నారని వివరించారు.

వ్యక్తిపై మద్యం సీసాతో దాడి

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై దాడి ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ. రామారావు తెలిపిన వివరాల ప్రకారం..యనమలకుదురుకు చెందిన బొమ్మిడి నాగరాజు 3 సంవత్సరాల క్రితం మచిలీపట్నం పోలాడుతిప్పకు చెందిన ఎం.నాగరాజు వద్ద రూ.60 వేలు అప్పు తీసుకున్నాడు. కాగా శనివారం అప్పుతీర్చుతానని బొమ్మిడి నాగరాజు చెప్పటంతో ఎం.నాగరాజు యనమలకుదురుకు వచ్చాడు. అతనికి ఇవ్వాల్సిన రూ.60 వేలను బొమ్మిడి నాగరాజు ఇచ్చిన తరువాత ఇద్దరూ మద్యం తాగారు. అప్పు 3 సంవత్సరాల తరువాత తీర్చుతావా అని ఎం.నాగరాజు ఆగ్రహంతో బొమ్మిడి నాగరాజుపై మద్యం సీసాతో తల పై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన బొమ్మిడి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

స్థలాలపై దక్కిన హక్కులు

- వేగంగా జరుగుతున్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్
- 8,859 స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన జగనన్న ఇంటి స్థలం లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో లబ్ధిదారులకు పూర్తి హక్కులు దక్కుతున్నాయి. చాలా కాలంగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న లబ్ధిదారుల ఆశ నెరవేరటంతో జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గత పరిస్థితి ఇదీ..

పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ విజయవాడ నగర శివారులో ఉన్నాయి. ఇక్కడి పేదలకు సొంత ఇళ్ల నిర్మాణం చేసుకోవాలనేది గతంలో కలగానే ఉండేది. పేదలు ఇక్కడ స్థలం కొనడమంటే ఊహకు కూడా అందని విషయం.

11,569 మందికి ఇళ్ల స్థలాలు..

అయితే జగనన్న అధికారం చేపట్టిన తరువాత పేదల ఆశలు నెరవేరే దిశగా చర్యలు చేపట్టారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం11,569 మందికి ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చింది.

ప్రతిపక్షాల కుట్రలను అడ్డుకుని..

అయితే ప్రతి పక్షాల కుట్ర కారణంగా పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా అడ్డుకుని కోర్టు కేసులు వేయటంతో పంపిణీ ప్రక్రియలో కొంత ఆటంకం కలిగింది. అయితే ప్రభుత్వం చిత్తశుద్ధితో వణుకూరు గ్రామంలో దాదాపు 380 ఎకరాల భూసేకరణ చేసి లేఅవుటులు వేసి 11,569 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. దీంతో పేదల జీవితల్లో జగనన్న వెలుగులు వెలిగాయి.

ఉచితంగా రిజిస్ట్రేషన్..

ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వదిలేయలేదు. వారికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించటంతో ఈ ప్రక్రియ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులకు సర్వహక్కులు దక్కుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప ప్రాంతాలకు చెందిన పేదలకు మ్యాపింగ్ చేసిన 8,228 మందికి ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ చేపట్టారు. పెనమలూరు మండలంలోని ఆరు గ్రామాలలో 2,944 మందికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండలం, మునిసిపాలిటీ కలిపి మొత్తం 11,172 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉండగా ముగింపు దశకు చేరుకుంది.



వణుకూరులో జగనన్న కాలనీ

గ్రామాల వారీగా రిజిస్ట్రేషన్ల వివరాలు..

గ్రామం పేరు	కేటాయించిన ఇంటిస్థలాలు	రిజిస్ట్రేషన్ అయిన స్థలాలు
యనమలకుదురు	2725	2304
కానూరు	3213	2438
పోరంకి	1453	1224
తాడిగడప	837	812
చోడవరం	155	146
గంగూరు	652	519
గోసాల	391	288
పెదపులిపాక	265	239
పెనమలూరు	994	568
వణుకూరు	487	321
మొత్తం	11,172	8859



పెనమలూరులో ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

నివాసం ఉన్న ప్రాంతంలోనే..

లబ్ధిదారులు ఎక్కడికో వెళ్లకుండా వారు నివాసం ఉన్న గ్రామంలోని సచివాలయాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగా జరుగుతోంది. ఇప్పటివరకు 8,859 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ జరుగగా ఇంకా 2,312 ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది.

చాలా ఆనందంగా ఉంది



జగనన్న మాకు ఇళ్ల స్థలం ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు స్థలం రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేస్తున్నారు. ఇల్లు కట్టుకోవాలన్న కలను జగనన్న నెరవేర్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాము. ఈ మేలు ఎప్పటికీ మరచిపోము. సొంత ఇల్లు సమకూరిందనే ఆనందం ఉంది.

–కర్రి భాగ్యలక్ష్మి, పెనమలూరు

ఇంటి యజమానురాలినయ్యా..



జగనన్న చేసిన సాయంతో ఇంటి యజమానురాలిని అయ్యాను. తనకు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కింది. ఇప్పుడు కొత్తగా కట్టుకున్న ఇంట్లో ఉండటమే కాకుండా రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయించి హక్కులు కల్పించారు.

–పెనుమూడి హైమావతి, పెనమలూరు

మంత్రిని కలిసిన మైనార్టీ నేతలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ, ఇతర నేతలు ఆదివారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని నేతలు సత్కరించారు. మైనార్టీ నేత ఎండీ.మున్నా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు జగనన్నకు అండగా నిలబడతామన్నారు. జగనన్నను తిరిగి సీఎంగా చేస్తామని తెలిపారు. పెనమలూరు నియోజవర్గంలో ఎమ్మెల్యేగా జోగి రమేష్‌ను గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు షాజాద్, కరిముల్లా, నాగరాజు, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.



మంత్రి జోగి రమేష్‌ను సత్కరిస్తున్న యనమలకుదురు మైనార్టీ నేతలు

మైనార్టీలు అంతా జగనన్న వెంటే

ఉయ్యూరు: ముస్లిం మైనార్టీలు అంతా సీఎం జగనన్నతోనే నడుస్తామని ఆ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని షాదీఖానాలో మైనార్టీ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణ అధ్యాయంలో లిఖించబడుతుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారన్నారు. వైఎస్సార్ బాటలోనే సీఎం జగనన్న నడుస్తూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం మాట్లాడుతూ టీడీపీ నీచ రాజకీయాలు సాగనివ్వమన్నారు. మైనార్టీల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్న దిగజారుడు పొత్తులను విశ్వసించబోమన్నారు. ముస్లిం సమాజం జగనన్నకు అండగా ఉంటుందని స్పష్టంచేశారు. నాయకులు అబ్దుల్ గఫూర్, సత్తార్, షరీఫ్, ఖాన్, బారీ, ఆసిఫ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

పొగమంచుతో రాకపోకలకు ఇబ్బందులు

పెనమలూరు: దట్టమైన పొగ మంచు కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గత నాలుగు రోజులుగా వేకువజామున దట్టమైన పొగమంచు పడుతోంది. ఈ కారణంగా విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డుపై విపరీతమైన పొగమంచు కప్పుకుంటోంది. దీంతో ఉదయం 9 గంటల వరకు మంచు వీడటం లేదు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారి కావడంతో పొగమంచుతో సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనదారులు హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్నారు. పొగ మంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



పోరంకి వద్ద మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై పొగమంచు

సీఎం జగన్‌కు మైనార్టీలు అండగా నిలవాలి

పెనమలూరు: మైనార్టీలు జగనన్నకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితుడైన షేక్ చిన్నా అన్నారు. షేక్ చిన్నాను వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం పోరంకి గ్రామంలో కృష్ణా జిల్లా నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు షేక్ రంజాన్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో చిన్నాను సన్మానించారు. చిన్నా మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. నూర్‌భాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ మాబి, సభ్యులు రంజాన్‌బి, షేక్ హసీనా, షేక్ వలి, షేక్ అమీనా పలువురు పాల్గొన్నారు.



చిన్నాను సన్మానిస్తున్న నూర్‌బాషా సంక్షేమ సంఘం మహిళా సభ్యులు

భక్తిశ్రద్ధలతో శాంతిహోమం

నేడు శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

పెనమలూరు: స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం కేడీసీసీబీ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, తాతినేని కోటేశ్వరరావు దంపతులు మహాశాంతి హోమం చేశారు. వీరితోపాటు భక్తులు పాల్గొని పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. గ్రామంలోని పల్లిపేటలో సోమవారం ఉదయం 10.38 గంటలకు విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, మూర్తి హోమం, అంగహోమం పూజలు చేస్తారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం భక్తులను అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు.



పూజలు చేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి దంపతులు

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామంలో కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై చాణక్య ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురు పందెంరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి మూడు పందెంకోళ్లతో పాటు రూ. 2060 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చాణక్య తెలిపారు.

విద్యార్థులకు సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యాయామ విద్య అభ్యసిస్తున్న ఇద్దరు పేద విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత అందించింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన శ్యామల లక్ష్మీప్రసన్న, జొన్నాడ ధనలక్ష్మి ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా హాస్టల్, మెస్ చార్జీలు చెల్లించేందుకు వీరిద్దరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మానవత సంస్థను ఆశ్రయించటంతో వీరిద్దరికీ కోర్సు పూర్తయ్యే వరకు ప్రతి నెలా వసతి, భోజన ఖర్చుల నిమిత్తం రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో శ్యామల లక్ష్మీప్రసన్న, జొన్నాడ ధనలక్ష్మిలకు చెరో రూ.5 వేల చొప్పున ఆదివారం మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదగా పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బాచారి, కళ్లెపల్లి నారాయణరావు పాల్గొన్నారు.



శాస్త్రోక్తం.. కుంభాభిషేకం



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని దేవస్థానం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించింది. నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ తాపడ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలను జరిపారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కేఎస్.రామారావు, ఎమ్మెల్యే విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆత్మబంధు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ విజేతలకు ఆదివారం సీవీఆర్ స్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. టాలెంట్ టెస్ట్‌లో ఏకేటీపీ మున్సిపల్ స్కూల్‌కు చెందిన వీ శ్యామ్‌శరత్‌బాబు ప్రథమ, ఎస్‌బీవీఎస్ఆర్ పాఠశాల విద్యార్థి ధాత్రిశ్రీ లక్ష్మి ద్వితీయ బహుమతి, జీడీఈటీ మున్సిపల్ స్కూల్ విద్యార్థి ఎం.కీర్తి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వీరికి వరుసగా మూడు వేలు, రెండు వేలు, వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులు ప్రకటించారు. వీరితో పాటు 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 500 చొప్పున కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. గణిత అధ్యాపకుడు ఎం.నరసింహారావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీవీఆర్ స్కూల్ హెచ్‌ఎం సీహెచ్ వెంకటసుబ్రహ్మణ్యం, ఆత్మబంధు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గ నృత్య మందిరానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు సహస్ర, కావ్యశ్రీ, తన్వి, ధరణి, హరిషిత, నందినిలతో పాటు మరి కొందరు చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. విజయవాడకు చెందిన కెజే.మోహిని బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కళావేదికపై విజయవాడకు చెందిన జి.గౌరీ, రాజ్యలక్ష్మి, జగన్మోహిని, అభిరామ్‌లు పలు కీర్తనలను ఆలపించారు.